క్లుప్తంగా

రాజరాజేశ్వరికి ప్రత్యేక అలంకరణ


అలంకరణలో అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుడివీధిలో ఉమారుద్ర కోటేశ్వరస్వామి దేవాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల ప్రారంభం ఆదివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహాలయ అమావాస్య పురస్కరించుకొని అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

అమ్మవారి అనుగ్రహం సాధించాలి


నరసింహమూర్తిని సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్ : మనలో ఉండే పంచకోశాలు మనసు, ప్రాణం, బుద్ధి, జీవం, భావాలను నవావరణాలంటారని, వీటి సాధన ద్వారా మనలో అజ్ఞానం తొలగి అమ్మవారి అనుగ్రహం పొందడమే విజయదశమి అని నిష్ఠల నరసింహమూర్తి అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో 'ముగ్గురమ్మల మూలపుటమ్మ' అనే అంశంపై ఆదివారం ప్రసంగించారు. పోతన రచించిన అమ్మలగన్న అమ్మ పద్యం విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో మందిర నిర్వాహకులు నారాయణమూర్తి, కోమలరావు, సంగమేశ్వరరావు, పట్నాయిక్, విశ్వేశ్వరరావు, బాబూరావు, ప్రసాదరావు, ఉమారాణి, అరుణ, సరస్వతి, లక్ష్మీ పాల్గొన్నారు.

రక్తదానంతో మరో ప్రాణానికి ఊపిరి


రక్తదాతలకు ధ్రువపత్రం అందజేస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

ఎచ్చెర్ల: రక్తదానం చేయడమంటే మరో ప్రాణానికి ఊపిరిపోసినట్టేనని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. భారత ప్రభుత్వ రక్తదాన్ అమృత మహోత్సవ్ 2.0లో భాగంగా ఎచ్చెర్ల మండలం చిన్నరావుపల్లిలో అన్నెపు లోకేష్ జ్ఞాపకార్థం రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో మెగా రక్తదాన శిబిరం, శ్రీ ఆదిత్య హెల్త్ కేర్ పాలీక్లీనిక్(ఎచ్చెర్ల) వైద్యులు బమ్మిడి జయసూర్య, పప్పల వేణుగోపాల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గాలి వెంకటరెడ్డి, విష్వక్‌సేన్, తమ్మినేని శ్రీనివాస్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, న్యూ సెంట్రల్ స్కూల్ డైరెక్టర్ పి.శ్రీకాంత్, లోకేష్ కుటుంబ సభ్యులు గణేష్, అమ్మాజమ్మ, సంతోష్ పాల్గొన్నారు.

సమాజ సేవ అభినందనీయం


రక్తదానం చేస్తున్న బ్యాంకు సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్: ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకు బ్యాంకింగ్ సేవలలోనే కాకుండా సామాజిక సేవలో కూడా ముందంజలో నిలవడం అభినందనీయమని డ్వామా పీడీ సుధాకర్ కొనియాడారు. బ్యాంక్ విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా ఆదివారం వాకథాన్ నిర్వహించారు. అవినీతి నిర్మూలన దిశగా ప్రయాణం చేయాలంటూ నినాదాలు చేశారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ జగన్మోహనరావు, పి.చైతన్యల సహకారంతో బ్యాంక్ సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు, రీజనల్ మేనేజర్ లావేటి అనంతరావు, బ్యాంకు అధికారులు నందిని సాహు, భాస్కర్‌ప్రసాద్, సునీల్, నాగరాజు, శ్రీరామ్ పట్నాయక్, సంతోష్, యూనియన్ నాయకులు రవి, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

శ్రీకాకుళం కల్చరల్ : కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న ధర్మశాస్త ఆలయంలో చిల్డ్రన్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఆటల పోటీలు జరిగాయి. 32 మంది పాల్గొనగా విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో నటుకుల మోహన్, ఎల్.నందికేశ్వరరావు, ప్రసాద్, బీఎంఎస్ పట్నాయిక్, దీప్తి, సంయుక్త, ఇందు పాల్గొన్నారు.

గొలుసు చోరీ

శ్రీకాకుళం రూరల్: చెరువులో దుస్తులు ఉతుకుతున్న మహిళ నుంచి బంగారు గొలుసు లాక్కొని దుండగుడు పరారయ్యాడు. సింగుపురం పంచాయతీ ధర్మవరపు భోగమ్మ చెరువులో దుస్తులు ఉతుకుతున్న సమయంలో గట్టుపై ఉన్న ఓ వ్యక్తి ఒక్కసారిగా దాడి చేసి ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసు లాక్కొని ద్విచక్ర వాహనంపై పరారయ్యాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ కె.రాము తెలిపారు.

గాలికొదిలేశారు!

- అడవిని తలపిస్తున్న గ్యాస్ క్రిమిటోరియం
- దహన సంస్కారాలకు తప్పని ఇక్కట్లు
- రూ.1.47 కోట్ల నిధులు వృథా


అడవిని తలపిస్తున్న గ్యాస్ క్రిమిటోరియం


నాడు పరిశుభ్రంగా గ్యాస్ క్రిమిటోరియం(ఫైల్)

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ) : నగర పరిధిలో దహన సంస్కారాల ప్రక్రియ ప్రహసనంగా మారింది. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గ్యాస్ క్రిమిటోరియం నిర్వహణను కూటమి పాలకులు గాలికొదిలేయడంతో అంత్యక్రియల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో పేదలకు అవస్థలు తప్పడం లేదు.

ఇదీ పరిస్థితి..

మనిషి మరణించాక భౌతికకాయాన్ని శ్మశానానికి తీసుకెళ్లేందుకు ప్రయివేటు వాహనం, కాల్చేందుకు కర్రలు, పెట్రోల్, డీజిల్ ఇతరత్రా సామగ్రితో వేలాది రూపాయలు ఖర్చుచేయాల్సి వస్తుంది. కాస్త స్తోమత ఉండేవారికి ఇవేమి పెద్ద లెక్కకాదు. నిరుపేదలకు మాత్రం అది భారంగానే ఉంటుంది. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో వందలాది మృతదేహాలను కొత్త బ్రిడ్జి వద్ద నాగావళి నదీ తీరంలో కాలుస్తుంటే తీవ్ర దుర్వాసన వెదజల్లేది. దీంతో అటువైపుగా రాకపోకలు సాగించేవారంతా ముక్కులు మూసుకుని వెళ్లే పరిస్థితి ఉండేది. కాలుతున్న మంటలను చూసి చిన్నారులు, మహిళలు తీవ్ర భయాందోళనకు గురయ్యేవారు. ఈ విషయం మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు దృష్టికి వెళ్లడంతో ప్రత్యామ్నాయ పరిష్కారం చేయాలని ఆలోచన చేశారు. విషయాన్ని అప్పటి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి తెలియజేయగా వెంటనే రూ.1.47కోట్లు నిధులు మంజూరుచేశారు. దుర్వాసనకు, చిన్నారులు, మహిళల భయాందోళనకు చెక్ పెట్టాలంటే గ్యాస్ క్రిమిటోరియం ఒక్కటే మార్గమని నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తిచేశారు. ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో గ్యాస్ క్రిమిటోరియం మిషనరీ తీసుకొచ్చేందుకు టెండర్లు వేసినవారు ఆ యంత్రాన్ని అమర్చలేదు. కనీసం ఎన్నికలయ్యాకైనా అక్కడ మిగిలిన పనులు పూర్తి చేయలేదు. 90 శాతం పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే పూర్తిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపుగా 15 నెలలు పూర్తయింది. అయినా మిగిలిన పనులు పూర్తిచేసేందుకు ఆలోచన చేయకపోవడంపై నగరవాసులు మండిపడుతున్నారు. కూటమి నేతలకు కాసులొచ్చే పనులు తప్ప ప్రజలకు ఉపయోగపడే పనులేవీ కనిపించడం లేదని విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో టెండర్లు పూర్తయి పనులన్నీ దాదాపుగా పూర్తయిన భవనాలు, అభివృద్ధి పనులపై కూటమి నేతలు దృష్టి సారించకపోవడంతో ఇప్పటికే చాలావరకు నిరుపయోగంగా మారాయి. తాజాగా గ్యాస్ క్రిమిటోరియాన్ని కూడా అదే కోవకు తీసుకొచ్చారు.

నాడు ఆహ్లాదం.. నేడు అధ్వానం..

గత ప్రభుత్వ హయాంలో క్రిమిటోరియం చుట్టూ మొక్కలతో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేశారు. కూటమి పాలకులు నిర్వహణ గాలికొదిలేయడంతో ఆ ప్రాంతమంతా పెద్ద అడవిలా తయారైంది. గేట్లు తుప్పు పట్టేసి గోడలన్నీ నాచు పట్టేశాయి. అందమైన మొక్కలన్నీ భూమిలో కలిసిపోయాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు చొరవ చూపి గ్యాస్ క్రిమిటోరియంను అందుబాటులోకి తీసుకురావాలని నగర ప్రజలు కోరుతున్నారు.


కనుమరుగైన ఆహ్లాదకరమైన మొక్కలు


తుప్పు పట్టిన ఇనుప గేట్లు

పరిశీలిస్తాం..



గ్యాస్ క్రిమిటోరియం పనులు పర్యవేక్షిస్తాం. పిచ్చిమొక్కలన్నీ తొలగించి శుభ్రంగా చేయిస్తాం. ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం. గ్యాస్ ఫిల్లింగ్ చేసేవారు వస్తామని చెప్పి రావడం లేదు. వారిని పిలిపించి వాడుకలోకి తీసుకొస్తాం.

– బి.శ్రీనివాసులు, మున్సిపల్ ఇంజినీర్, శ్రీకాకుళం కార్పొరేషన్

ప్రదర్శన అదుర్స్



జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో శివశ్రీ నృత్య నికేతన్ విద్యార్థుల నృత్యప్రదర్శన అలరించింది. గీతాంజలి స్కూల్ వ్యవస్థాపకురాలు ఎస్.ఉమాదేవి, డైరెక్టర్ పద్మజలను భారతీయ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ నిర్వాహకులు రెసిపియంట్ ఆఫ్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుతో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శివశ్రీ నృత్యనికేతన్ వ్యవస్థాపకులు రఘుపాత్రుని శ్రీకాంత్ నాట్యాంజలి అనే ప్రదర్శన ఏర్పాటు చేశారు. – శ్రీకాకుళం కల్చరల్

అ'పూర్వ' కలయిక



జె.ఆర్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఘనంగా జరిగింది. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు కె.అప్పారావు, కుమార్, పి.సూర్యనారాయణ, ఎం.లక్ష్మునాయుడు, ఆర్.లక్ష్మణరావు, ఎస్.వి.వి.జోగారావు, ఎం.సత్యవతి, మీసాల శ్రీనివాసరావు, సీహెచ్ వసంతరావు, జి.బలరాం, మన్నెల శ్రీనివాసరావు, లంక కృష్ణ, బి.వాణి, విమలను ఘనంగా సన్మానించారు. –రణస్థలం

విద్యుత్ కనెక్షన్ తొలగింపు సరికాదు


అనుమతులు చూపిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం రూరల్: కల్లేపల్లి పంచాయతీ మోపస్‌బందరు రెవెన్యూ పరిధిలో సుమారు 25 ఎకరాల రొయ్యల చెరువుల ఫార్మింగ్‌కు ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే విద్యుత్ కనెక్షన్లు తొలగించడం అన్యాయమని నిర్వాహకులు నెల్లిమర్ల వెంకట సోమ సుదర్శనరావు, నెల్లిమర్ల పూర్ణ చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు అనుసరించి కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ సర్టిఫికెట్‌తో రొయ్యల పెంపకం చేస్తున్నట్లు చెప్పారు. కేవలం విద్యుత్ కోసమే సుమారు రూ.18లక్షలు వెచ్చించి ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ చెరువులకు పెదగనగళ్లవానిపేట గ్రామానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఇవి కల్లేపల్లి పంచాయతీ మోపస్‌బందరు పరిధిలో ఉన్నట్లు చెప్పారు. శిస్తు కూడా కడుతున్నామని తెలిపారు. 1994 నుంచి రొయ్యల చెరువు ఫారం నిర్వహిస్తున్నామని, వీటిపై 70 కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని చెప్పారు. ప్రస్తుతం 25 ఎకరాల పరిధిలో 13 ట్యాంకుల్లో రొయ్యల పెంపకం సాగిస్తున్నామని, పిల్ల దశలో ఉన్న ఈ రొయ్యలు వేసి సుమారు 73 రోజులు కావస్తుందన్నారు. అర్ధంతరంగా విద్యుత్ కనెక్షన్లు తొలగించడం అన్యాయమన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి


వందనను పరామర్శిస్తున్న దళిత సంఘాల జేఏసీ నాయకులు

శ్రీకాకుళం: పొందూరు మండలం లోలుగు కేజీబీవీలో ఇంటర్ సెకెండియర్ చదువుతూ శనివారం జరిగిన ఘటనలో గాయపడిన చిత్తారపు వందనకు మెరుగైన వైద్య సహాయం అందించాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వందనను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేఎన్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె.వి.జగన్నాథరావు, బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శిర రమేష్ బాబు, మత్స్యకార సంక్షేమ సంఘం జిల్లా నాయకులు ఫల్గుణరావు, దళిత హక్కుల పరిరక్షణ సమితి ఉపాధ్యక్షుడు బైరి ధనరాజ్, ఆల్ ఇండియా అంబేద్కర్ మిషన్ నాయకులు నేతల అప్పారావు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఎడ్ల జానకిరామ్, రెల్లి సంక్షేమ సంఘం జిల్లా నాయకులు ఆర్.జి.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు

మాజీ సైనికుల సంక్షేమమే ధ్యేయం


సంఘానికి విరాళం అందిస్తున్న ప్రకాశరావు

శ్రీకాకుళం కల్చరల్: మాజీ సైనికులు, వీరనారీమణుల కుటుంబాలతో త్వరలో మెగా పిక్నిక్ ఏర్పాటు చేయనున్నట్లు అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని రెల్లివీధిలోని జిల్లా ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ భవనంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. మాజీ సైనికుల కోసం జవాన్ పార్కు అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు ప్రకటించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆర్మీలో ఇటీవల రిటైరైన జి.ప్రకాశరావు సంఘం అభివృద్ధి కోసం రూ.10వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ వి.సూర్యనారాయణ, జనరల్ సెక్రటరీ పి.మురళీధరరావు, గౌరవాధ్యక్షుడు తమ్మినేని కృష్ణారావు, ఎస్.రామకృష్ణ, ఎం.సింహాచలం, పి.పద్మావతి, అమ్మన్నమ్మ, జమున, అన్నపూర్ణ, రత్నమాల, భారతి, జి.రామారావు, బి.రాంబాబు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తి వీడాలి

శ్రీకాకుళం క్రైమ్ : చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండి నేర ప్రవృత్తిని వీడాలని శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు రౌడీషీటర్లకు హితవుపలికారు. ఆదివారం స్టేషన్ ఆవరణలో అవగాహన కల్పించారు. ఆర్థిక లావాదేవీలు, భూ సెటిల్మెంట్లు, భార్యాభర్తల తగువుల్లోను రాజకీయ అండదండలతో రెచ్చిపోతే పీడీ యాక్టులు నమోదు చేయడమే కాక జిల్లా బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి స్థానికులకు అంతరాయం కలిగించినా ఊరుకునేది లేదన్నారు.

స్నేహశీలి తులసీదాసు


మజ్జి తులసీదాసు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: స్నేహశీలి మజ్జి తులసీదాసు అని గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు అన్నారు. గురజాడ విద్యాసంస్థలతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆదివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్, జాయింట్ కరస్పాండెంట్ అంబటి రంగారావు, ప్రిన్సిపాల్ కె.వి.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆదిత్యాలయానికి భక్తుల తాకిడి


ప్రధానార్చకులు శంకరశర్మతో యోగాగురువు రమేష్ బృందం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. ఆరోగ్యం కోసం పలువురు భక్తులు సంప్రదాయక వస్త్రధారణలతో సూర్యనమస్కారాల పూజలు చేయించుకోగా.. మరికొందరు తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు ఇబ్బందులకు గురికాకుండా ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదిత్యున్ని దర్శించుకున్నారు. ఆలయ భద్రత చర్యలపై ఆలయ అధికారులతో చర్చించారు.

- మానససరోవర యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని వచ్చిన విశాఖకు చెందిన ప్రముఖ యోగా గురువు చిలకా వెంకట రమేష్, ఆదిమూలం నాగరాజు, డొంకర సత్యనారాయణ, కదిరి సందీప్ తదితర బృందం ఆదివారం ఆదిత్యున్ని దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మను కలిసి యాత్ర విశేషాలను ముచ్చటించారు. త్వరలో అరసవల్లి సూర్యక్షేత్రంలో సామూహిక సూర్యనమస్కారాల ప్రక్రియ ఏర్పాటు చేస్తామని రమేష్ ప్రకటించారు.

ప్రపంచ శాంతి పరిరక్షణకు కృషి చేయాలి


మాట్లాడుతున్న ఇస్కఫ్ జిల్లా అధ్యక్షుడు రాజు

శ్రీకాకుళం అర్బన్: ప్రపంచ శాంతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం(ఇస్కఫ్) జిల్లా అధ్యక్షుడు బి.వి.ఎస్.ఎన్.రాజు పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచం శాంతి దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శాంతి మార్గం ద్వారానే దేశ ప్రగతి సాధ్యమన్నారు. శాంతి అంటే సంఘర్షణ లేకపోవడం మాత్రమే కాదని, పరస్పర అవగాహన, సహకార స్ఫూర్తితో విభేదాలను పరిష్కరించుకోవడమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇస్కఫ్ రాష్ట్ర శాఖ సభ్యులు మల్లేశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడుబుడుమూరు శ్రీరామమూర్తి, స్టార్ వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు ఇందిరాప్రసాద్, ఎస్.జోగినాయుడు, బాలల హక్కుల పరిరక్షణ వేదికల రాష్ట్ర అధ్యక్షుడు గురుగుబెల్లి దామోదరరావు, జిల్లా శాఖ కన్వీనర్ బెండాళం వరలక్ష్మి, ఇస్కఫ్ ఉపాధ్యక్షులు సీపాన రామారావు, జాయింట్ సెక్రటరీ దిబ్బ ప్రసాదరావు, గుప్త, యువ రచయితల వేదిక జిల్లా కన్వీనర్ టి.ఎర్రమ్మ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత గురజాడ


సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ప్రభాత భేరి ర్యాలీ


తెరవే ఆధ్వర్యంలో గురజాడకు నివాళులు


గ్రంథాలయంలో గురజాడ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: దేశంలో నెలకొని ఉన్న విద్వేషపూరిత వాతావరణంలో అన్ని మతాలు, కులాల మధ్యన ఐక్యతను పెంపొందించాల్సిన అవసరం ఉందని, ఇందుకు గురజాడ దేశభక్తి గీతం ఎంతగానో తోడ్పడుతుందని వక్తలు పేర్కొన్నారు. మహాకవి గురజాడ అప్పారావు 163వ జయంతి సందర్భంగా సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో దేశభక్తి గీతాన్ని ఆలపిస్తూ ఆదివారం ప్రభాత భేరి నిర్వహించారు. డే అండ్ నైట్ కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్సు, అంబేద్కర్ జంక్షన్, కోడిరామ్మూర్తి స్టేడియం మీదుగా ఆర్ట్స్ కళాశాల వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు, సాహితీ స్రవంతి కన్వీనర్ కేతవరపు శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి సామరస్యానికి, సామాజిక అభ్యుదయానికి బాటలు వేసిన నవయుగ వైతాళికుడు గురజాడ అని కొనియాడారు. కార్యక్రమంలో బాడాన శ్యామలరావు, కంచరాన భుజంగరావు, డాక్టర్ కె.ఉదయ్‌కిరణ్, నెట్టిమి రమణ, పి.దివాకర్, ఆర్.ప్రకాష్, చింతాడ రామచంద్రరావు, కె.నాగమణి, ఏ.లక్ష్మీ, పి.సుధాకర్, ఖగేష్, కలమట దాసుబాబు, చింతాడ రామచంద్రరావు పాల్గొన్నారు.

- తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో గురజాడ జయంతిని గాంధీమందిరంలో నిర్వహించారు. తెరవే అధ్యక్ష, కార్యదర్శులు యు.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆర్.వి.రమణమూర్తి, పైడి హరనాథ్, నిక్కు అప్పన్న, కోమలరావు, కె.శ్రీనివాసరావు, ఎం.ఉపేంద్రశర్మ, ఇద్దిపాపయ్య, వి.రాజారావు, ఉమాకవిలు గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

శ్రీకాకుళం అర్బన్: బలగ హడ్కో కాలనీ శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ పి.ఉగ్రసేను ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకాకుళం విద్యాశాఖ విశ్రాంత సూపరింటెండెంట్ ప్రసాద్, శ్రీ కళావేదిక శ్రీకాకుళం కన్వీనర్ బి.ఉమామహేశ్వరరావు, ఇద్ది పాపయ్య, బలగ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు ఉప్పు త్రినాథరావు, లైబ్రరీ సహాయకురాలు కె.అనిత పాల్గొన్నారు.

సర్వేయర్ల చేతివాటం!

- వ్యవసాయ భూములకు సబ్ డివిజన్ చేసేందుకు కమీషన్ల వసూలు
- రోవర్ల ద్వారా సర్వే చేయాలంటే అదనంగా చెల్లించాల్సిందే
- పట్టించుకోని రెవెన్యూ ఉన్నతాధికారులు



శ్రీకాకుళం మండల తహశీల్దార్ కార్యాలయం

శ్రీకాకుళం రూరల్:

మండల పరిధిలో కొంతమంది సచివాలయ సర్వేయర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కమీషన్‌లు ఇస్తే తప్ప వ్యవసాయ భూములకు సబ్ డివిజన్ చేసేందుకు ముందుకు రావడం లేదనే రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంతా మండల సర్వేయర్‌కు తెలిసినా పట్టించుకోవడం లేదనే ప్రచారం జరుగుతోంది. కొన్ని నెలల క్రితం కొంతమంది సర్వేయర్లు చేతివాటం ప్రదర్శించడంతో వారిని ఉన్నఫలంగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. వారు అక్కడితో ఆగకుండా పాత పరిచయాలతో మరోసారి స్థానిక భూ వ్యవహారాలు, సబ్ డివిజన్ పనుల్లో ఆధిపత్యం కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఓ మహిళా సర్వేయర్ పనితీరుపైనా స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఏ పని చేసినా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకపోవడం, చేసిన పనిలో చేతివాటం ప్రదర్శించడం జరుగుతోందని రెవన్యూ అధికారులకు ఫిర్యాదులు సైతం వెళ్లినట్లు సమాచారం. ఆమె పరిధిలో ల్యాండ్ వ్యవహారంలో పాస్‌బుక్‌లు అందించేందుకు గాను ఓ రైతు వద్ద రూ.లక్షల్లో డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

కమీషన్ ఇవ్వాల్సిందే..

ప్రభుత్వ నిబంధనలు అనుసరించి కొంతమంది సర్వేయర్లు తమ పరిధిలో రోవర్‌తో సర్వేచేస్తే వాటికి డబ్బులు డిమాండ్ చేయడం పరిపాటిగా మారింది. వాస్తవంగా రోవర్ అనే పరికరాన్ని ప్రభుత్వం ఉచితంగా మండల కేంద్రానికి అందుబాటులో ఉంచింది. గతంలో రీ సర్వే సైతం దీని ద్వారానే చేపట్టి రైతులు భూములు సబ్‌డివిజన్ చేసేదిశగా రోవర్ల ఉపయోగించారు. ప్రస్తుతం ఆ పరికరాన్ని ఎక్కడైనా కొలతలు నిమిత్తం ఉపయోగిస్తే కొంతమంది సర్వేయర్లు డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

విచారణ చేస్తాం..

కొన్ని పంచాయతీల్లో సచివాలయ సర్వేయర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు వచ్చిన విషయం మా దృష్టికి వచ్చింది. వాటిపై విచారణ చేస్తాం. రోవర్‌ను ఉపయోగించి ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

– గణపతిరావు, శ్రీకాకుళం తహశీల్దార్